సాక్షి
నారాయణపేట
సోమవారం । 24 । మార్చి । 2025



సేవలు అమోఘం

రెడ్డి సేవా సమితి సేవలు అమోఘమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (సోమవారం సాయంత్రం)

సహర్ 4-54 (మంగళవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.5 /21.4


రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.



గొర్రెలకు మేతకు వదిలేసిన వరిపంట

అప్పు చేసి సాగు చేసినా..

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన బొల్లెద్దుల లక్ష్మయ్య కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వ కింద రెండు ఎకరాల వరి పంటను వేశాడు. ఎకరాకు రూ.20వేల చొప్పున రూ.40 వేలు ఖర్చు చేసి పంట సాగు చేశాడు. పదిరోజులుగా సాగునీరు రాకపోవడంతో చేతికి వచ్చిన పంట ఎండిపోయింది. చేసేది లేక పంటను గొర్రెల మేతకు వదిలేశాడు." కేఎల్ఐ కాల్వ నుంచి సాగునీరు వస్తుందని అప్పు చేసి సాగు చేశా. పది రోజులుగా నీరు అందడం లేదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా లాభం లేకుండాపోయింది. అందుకే జీవాల మేతకు వదిలేశా. ప్రభుత్వమే ఆదుకోవాలి.." అని లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



పశువులకు మేతగా మారిన చంద్రమౌళి వరిపంట

మూడెకరాలు ఎండిపోయింది..

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం దోకూరుకు చెందిన రైతు చంద్రమౌళి తన ఐదు ఎకరాల పొలంలో యాసంగి సాగు కింద వరిపంట వేసుకున్నాడు. కోయిల్‌సాగర్ నీరు వస్తే పంట బాగా వస్తుందనే ఆశ ఉండేది. అయితే పాత ఆయకట్టు వరకే నీటిని వదలడంతో ఆయన ఆశలు అడియాశలయ్యాయి. పొలంలో ఉన్న బోరు ఎండిపోవడంతో పంట పొట్టకొచ్చే దశలో నీటి వనరులు లేక మూడెకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. దీని పశువుల మేతకు వదిలేశాడు. మిగిలిన రెండెకరాల పంటను కాపాడుకోవడానికి రూ.3 లక్షలు ఖర్చు చేసి మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదు. వేసిన పంట పోయింది. అప్పు మాత్రమే మిగిలిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- సుమారు 36 వేల ఎకరాల్లో ఎండిన వరి
- ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- పలు ప్రాంతాల్లో మొక్కజొన్న తదితర పంటలు సైతం
- యాసంగి నిండా ముంచిందంటూ రైతుల ఆవేదన

చివరికి కన్నీరే..!

సాగునీరు లేక ఎండుతున్న ప్రధాన పంట

యాసంగిలో ఎన్నో ఆశలతో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులకు కన్నీరే మిగులుతోంది. సాగునీరు అందక పంటలు ఎండుముఖం పట్టడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 36వేల ఎకరాల్లో వరి ఎండిపోగా.. వారం, పది రోజుల్లో భారీ స్థాయిలో ఎండిపోయే పరిస్థితి ఉంది. పలు ప్రాంతాల్లో మొక్కజొన్న, కంది తదితర పంటలు సైతం అక్కరకు రాకుండా పోయినట్లు తెలుస్తోంది. వేసవికాలం సీజన్ మొదట్లోనే ఎండలు తీవ్ర రూపం దాల్చడం.. భూగర్భ జలమట్టం అధఃపాతాళానికి పడిపోవడమే ఈ దుస్థితికి కారణం కాగా.. రైతాంగం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పెరిగిన వరి సాగు.. తగ్గిన జలమట్టం

గత ఏడాది యాసంగిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,76,079 ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 5,43,466 ఎకరాల్లో వరి సాగు కాగా.. గత సంవత్సరం ఇదే సీజన్‌తో పోలిస్తే 67,387 ఎకరాల్లో అధికంగా వరి సాగైనట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే భూగర్భ జలమట్టం మెరుగ్గా ఉన్నప్పటికీ.. భగభగ మండుతున్న ఎండలతో ఈ నెలలోనే భారీగా దిగువకు పడిపోయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సగటున పది మీటర్లకు పైగా జలం పాతాళానికి పడిపోయినట్లు స్పష్టమవుతోంది.

జిల్లాల వారీగా ఇప్పటి వరకు నష్టం..

సాక్షి పరిశీలన

మహబూబ్‌నగర్ జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. భానుడి భగభగలతో భూగర్భ జలాలు పడిపోవడంతో ఇప్పటి వరకు సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అధికారులు అంచనా వేశారు. హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్, గండీడ్, నవాబ్‌పేట, మిడ్జిల్, మహమ్మదాబాద్, కోయిల్‌కొండ, రాజాపూర్, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లో పలువురు రైతులకు చెందిన వరి పంట చేతికందకుండా పోయినట్లు 'సాక్షి' పరిశీలనలో తేలింది. రెండు రోజులుగా వడగండ్ల వర్షం కురిసినా దీని వల్ల రైతులకు లాభం కంటే ఎక్కువ నష్టం కలిగింది.



వెల్దండ మండలం బండోనిపల్లిలో నీరులేక ఎండిపోతున్న వరిపంటను చూపుతున్న రైతు

యాసంగిలో పెరిగిన సాగు, ఎండిన పంటనష్టం వివరాలు.. (ఎకరాల్లో)

జిల్లా	గత యాసంగిలో	ప్రస్తుత యాసంగిలో	పూర్తిగా ఎండిన పంట (అంచనా..)
మహబూబ్‌నగర్	1,12,000	1,25,000	20,000
నాగర్‌కర్నూల్	1,16,577	80,772	2,000
జోగుళాంబ గద్వాల	44,379	69,694	6,000
వనపర్తి	90,123	1,40,000	5,000
నారాయణపేట	1,13,000	1,28,000	3,000

❒ వనపర్తి జిల్లాలో ఈ యాసంగిలో 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాకు జూరాల, భీమా, కేఎల్ఐ సాగు నీరు తగ్గడం.. భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో వనపర్తి, ఖిల్లాఘణపురం, పాన్‌గల్ మండలాల పరిధిలో ఇప్పటివరకు సుమారు 200 ఎకరాల మేర పంట ఎండిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే జిల్లావ్యాప్తంగా ఐదు వేల ఎకరాల వరకు వరి ఎండినట్లు తెలుస్తోంది.

❒ జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగు నీరందక కేటీదొడ్డి మండలంలోని కొండాపురం, గువ్వలదిన్నె, పాతపాలెం, ఉమిత్యాల, నందిన్నె, ధరూర్ మండలంలోని అల్లాపాడు, కోతులగిద్దె, కొత్తపాలెం, గట్టు మండలంలోని పెంచికలపాడు, మాచర్ల, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల ఎకరాల్లో వరి ఎండిపోయింది. అధికారులు మాత్రం 250 ఎకరాల్లో మాత్రమే పంట ఎండిపోయినట్లు చెబుతున్నారు.

❒ నాగర్‌కర్నూల్ జిల్లాలో 175 ఎకరాల్లో వరి, 72 ఎకరాల్లో మొక్కజొన్న, 10 ఎకరాల మేర కంది, ఇతర పంటలు.. అదేవిధంగా నారాయణపేట జిల్లాలో 205 ఎకరాల్లో వరి ఎండినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఈ రెండు జిల్లాలు కలిపి నీరందక సుమారు నాలుగు వేల ఎకరాల మేర పంట ఎండినట్లు తెలుస్తోంది.



హన్వాడ మండలం మునిమోక్షంలో మూగజీవాలకు వదిలేసిన వరిపంట

ఆశలు.. ఆవిరి

వివరాలు 8లో..

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి రూ.12 లక్షల విరాళం

నర్వ: మండలంలోని పాథర్చేడ్ ఆంజనేయ స్వామి ఆలయ గోపుర నిర్మాణానికి ఓ భక్తుడు భారీ విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయం ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామానికి చెందిన బీరప్ప కుటుంబసభ్యులు పాల్గొని ఈ విరాళాన్ని ప్రకటించారు. బీరప్ప గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గ్రామంపై ఉన్న మక్కువతో తన కుమారుడు సాయిగణేష్ జ్ఞాపకార్థం ఆలయ శిఖర నిర్మాణానికి రూ.12 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి ఆయన అందిస్తున్న విరాళానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి

ఊట్కూరు: దేశ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదిత్య పరాశ్రీ అన్నారు. ఆదివారం బిజ్వార్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉపమండల వార్షికోత్సవ పదసంచలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఆదిత్య పరాశ్రీ, రాష్ట్ర గోసేవా ప్రముఖ్ వెంకట నివాస్ హాజరయ్యారు. ముందుగా స్వయం సేవకులు ధనవేశ్‌తో గ్రామ పురవీధుల్లో శోభయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిత్య పరాశ్రీ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శతాబ్దిలోకి అడుగుపెట్టడం సంతోషకరమని అన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసి హిందువుల్లో దేశభక్తిని రగిలించి హిందూ సంఘటన్‌తో మన దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో, యువతలో దేశభక్తిని పెంచేందుక కృషి చేస్తుందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవక్‌లు వివిధ క్షేత్రాల్లో పనిచేస్తూ దేశం పట్ల, ధర్మం పట్ల జాగృతం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాంరెడ్డి, కేశవరావు, భీంరాజ్, అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

4న గోమాత కల్యాణం

బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలో ఏప్రిల్ 4న గోమాత కల్యాణం నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఆదివారం అంబత్రయ క్షేత్రంలో గోకల్యాణ పత్రికను విడుదల చేశారు. సనాతన ధర్మం ప్రకారం గోమాత లక్ష్మీదేవి స్వరూపం అని గోమాత ఆరాధనతో సకలదేవుళ్ల పూజలఫలం లభిస్తుందని తెలిపారు. గోకళ్యాణానికి ముఖ్య అతిథిగా హర్యాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారని తెలిపారు.



ఎల్‌ఆర్‌ఎస్ @ 920



నారాయణపేట మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు వచ్చిన దరఖాస్తుదారులు

రాయితీ ఇచ్చినా స్పందన అంతంతే

- 34,396 దరఖాస్తులకు 17,303 ఆమోదం
- రూ.25 కోట్ల లక్ష్యానికి వచ్చింది రూ.1.65 కోట్లే..
- మిగిలింది 8 రోజులే..

నారాయణపేట: అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 2020లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 34,396లో 17,303 ఆమోదం పొందాయి. మూడు మున్సిపాలిటీల్లో 21,384 దరఖాస్తులు రాగా..140 జీపీల్లో 13,012, రూ.10 వేలు చెల్లించిన వెంచర్లు 403 ఉన్నాయి. ఇందులో నిషేధిత జాబితాలో మూడు మున్సిపాలిటీల్లో 3, గ్రామాల్లో 3 వెంచర్లను అధికారులు గుర్తించారు. ఈనెలాఖరు వరకు ఎస్ఆర్‌ఎస్ చేయించుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారు. కాగా వీరిలో 920 మంది మాత్రమే స్పందించి క్రమబద్ధీకరణ చేసుకున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

ఎల్‌ఆర్‌ఎస్ రుసుంలో తప్పిదాలు వస్తున్నాయి. ఎస్ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఓ యాప్ రూపొందించింది. సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు, సిటిజన్ లాగిన్లు ఇచ్చారు. దరఖాస్తుదారులకు ఇచ్చిన సిటిజన్ లాగిన్‌పై అవగాహన లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దరఖాస్తుదారుడి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా ఫీజులు వేయాలి. ఆన్‌లైన్‌లో వచ్చిందే ఫీజు అంటున్నారే తప్పా.. ఏ దానికి ఎంత అని వివరించలేకపోతున్నారు. సిస్టమ్‌లో వచ్చిందే కరెక్టు.. ఆ సిస్టమేంటో చెప్పాలంటే చెప్పాలేకపోతున్నారు.

రాయితీతో మేలు



అనధికార లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలతో ఎల్ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీతో చెల్లించాలి. మిగిలింది 8 రోజులు మాత్రమే. ఈ సువర్ణ అవకాశాన్ని జిల్లాలోని రియల్టర్లు, ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కిరణ్‌కుమార్, టీపీఓ, నారాయణపేట

అంతా ఆన్‌లైన్‌లోనే..



2020 కంటే ముందు 10 శాతం రిజిస్ట్రేషన్ చేసిన లేఅవుట్‌లకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునేందుకు వీలు కల్పించింది. ఎంతెంత ఫీజు వసూలు చేయాలని అంతా ఆన్‌లైన్‌లో చూపుతోంది. రూ.వెయ్యి కట్టిన వారు ఎల్‌ఆర్‌ఎస్‌తో పాటు రిజిస్ట్రేషన్ సైతం చేసుకోవచ్చు.

– రాంజీ, సబ్‌రిజిస్ట్రార్, నారాయణపేట

స్పందన కరువు

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు ఫీజులో 25 శాతం రాయితీ ఇచ్చినా దరఖాస్తుదారుల నుంచి స్పందన కరువైంది. బల్దియా పరిధిలో నామమాత్రంగానే ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకున్నారు. రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అక్రమ లేఅవుట్లను రెగ్యులరైజ్ చేయించుకోవాలని బల్దియా అధికారులు ప్రచారం చేస్తున్నా అంతంతే కనిపిస్తోంది. ఇక గ్రామీణప్రాంతాల్లో మరింత దారుణంగా ఉంది.

జిల్లా వివరాలిలా..

మున్సిపాలిటీ/జీపీలు	వచ్చిన దరఖాస్తులు	ఆదాయం అంచనా (రూ.కోట్లలో)	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
నారాయణపేట	6,973	5	58.17
మక్తల్	10,502	10	32.14
కోస్గి	3,909	2	23.14
140 జీపీల్లో	13,012	8	50.88

మున్సిపాలిటీల్లో వచ్చిన, ఆమోదించిన దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఆమోదం	చెల్లింపులు కానివి	చె.పూర్తి అయినవి
మక్తల్	10,502	4,269	4,171	98
నారాయణపేట	6,973	1,695	1,521	174
కోస్గి	3,909	1,745	1,627	118

మండలాల వారీగా ఆమోదం పొందినవి..

మండలం	దరఖాస్తులు	ఆమోదం	చెల్లింపులు కానివి	చె.పూర్తి అయినవి
మరికల్	3,973	2,940	2,860	80
నారాయణపేట	3,006	1,991	1,903	88
ఊట్కూర్	1,922	1,276	1,171	105
మద్దూర్	1,477	1,194	1,149	45
మక్తల్	834	625	581	44
కృష్ణా	660	653	620	33
ధన్వాడ	393	266	205	61
మాగనూర్	224	170	164	06
కోస్గి	213	191	176	15
దామరగిద్ద	168	167	153	14
నర్వ	142	121	92	29

భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం



జిల్లా కేంద్రంలో సీపీఎం నాయకుల బైక్ ర్యాలీ

నారాయణపేట: ప్రజా పోరాటాల ద్వారానే ప్రజలకు దోపిడీ పీడనల నుండి విముక్తి జరుగుతుందన్న భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జీ వెంకట్రామిరెడ్డి ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఎం, డివైఎఫ్ఐ ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పార్క్ దగ్గర బహిరంగ సభ నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా అమల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్నప్పటి నుంచి లౌకిక భావాలతో విస్తృతమైన ప్రజా పోరాటాల ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కులం మతం ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరినీ సంఘటితం చేసి పోరాడారని అన్నారు. బీజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత చరిత్ర వక్రీకరణలు, విభజన, విద్వేష రాజకీయాలతో బ్రిటీష్ వారిని మించి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నేడు భగత్ సింగ్ ఆశయాలకు భిన్నంగా పాలన నడిపించడమే కాకుండా మళ్లీ భగత్‌సింగ్ వారసులం అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్య విస్తృత ప్రజా ఉద్యమాల ద్వారా స్వాతంత్రోద్యమ కాంక్షను పెంచారని అన్నారు. ప్రజా పోరాటాలు వ్యక్తితో ప్రారంభమై ఒక వ్యక్తితో ముగిసేవి కాదని సమాజంలో దోపిడీ, పీడన ఉన్నంతవరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్న భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న శ్రమ దోపిడి పీడనలకు, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద యుద్ధాల దోపిడీ పీడన నుండి మానవ జాతి సామాజిక వ్యవస్థను నెలకొల్పడమే అంతిమ లక్ష్యంగా జీవితాంతం పోరాడిన భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజల పక్షాన చివరిదాకా నిలిచి సీపీఎం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోపాల్, బాల్ రామ్, అంజిలయ్య గౌడ్, పుంజనూరు ఆంజనేయులు,మహేష్ కుమార్ గౌడ్, కార్మిక, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు మహ్మద్ అలీ, బాలు, పవన్ జోషి, అశోక్, దస్తప్ప, నర్సింహ, రాములు, పాల్గొన్నారు

మార్గదర్శి భగత్‌సింగ్

నారాయణపేట ఎడ్యుకేషన్: దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసిన ధీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని, వారు దేశ యువతకు మార్గదర్శులని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ అన్నారు. పీడీఎస్‌యూ, పీవైఎల్, యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాశీనాథ్, సాయికుమార్, గొస్ మారుతి, వెంకటేష్, రాము, సాగర్, ప్రేమ్‌రాజ్, కృష్ణ, నితిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

'జై సంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, పార్టీ ప్రతినిధులు

నారాయణపేట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి గ్రామంలో చేపట్టే పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు కదం తొక్కాలని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, జిల్లా ఇన్‌చార్జ్ ధారాసింగ్‌నాయక్ పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన జై బాపు..జై భీమ్.. జై సమిధాన్ ఆల్ ఇండియన్ కాంగ్రెస్ జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల స్థాయి సన్నాహక సమావేశ ఏర్పాట్లు మండల స్థాయిలో జరిగేలా మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అధ్యక్షత వహించాలన్నారు. అలాగే గ్రామాల పాదయాత్ర జాబితా రూట్ ప్లాన్ ప్రోగ్రామ్స్ ప్రారంభం , ముగింపు తేదీలను ఖరారు చేయాలన్నారు. ఏ గ్రామంలో మొదలవుతుంది, ఎక్కడ ముగుస్తుంది అనే అంశాలపై ప్రతి ఒక్కరికి తెలియపరచాలన్నారు. మార్చి 28 కంటే ముందు పూర్తి చేయాలన్నారు. తదనుగుణంగా జిల్లా మండల స్థాయి ప్రణాళికబద్ధమైన సమావేశాలకు పీపీటీలను భాగస్వామ్యం చేయాలన్నారు. పాదయాత్రకు గ్రామంలోకి ప్రవేశించడానికి ఒక రోజు ముందు ప్రజలకు తెలియజేయడానికి, జనాన్ని సమీకరించడానికి డప్పు చాటింపు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు ప్రసన్నా రెడ్డి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం స్థల పరిశీలన

మక్తల్: ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం మక్తల్ మండలం గొల్లపల్లి శివారులో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం పరిశీలించారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన తర్వాత దాదాపు 2,500 మంది విద్యార్థులు చదువుకొనేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, వెంకటేష్, తాయప్ప, ఏఈ నాగశివ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి


ఖిల్లాఘనపురం మండలం కొత్తపల్లితండాలో ఎండిన వరిపంట


నవాబుపేట మండలం కామారం గ్రామానికి చెందిన రైతు గోరుగాని చంద్రయ్య తనకున్న మూడెకరాల్లో వరిపంట సాగు కోసం రూ.లక్ష ఖర్చుచేసి రెండు బోర్లు డ్రిల్లింగ్ చేయిస్తే ఒక్క బోరులో నీరు వచ్చింది. దీంతో పంటసాగు చేశాడు. తీరా వేసవి ప్రారంభంలోనే బోరుబావిలో నీటిమట్టం పడిపోవడంతో ఎకరా పంటకు నీరందడం కష్టంగా మారింది. రెండెకరాల వరిపొలం రైతు కళ్లెదుటే ఎండింది. బోరుడ్రిల్లింగ్, పంటసాగుకు తెచ్చిన

నెర్రెలు బారిన పొలాలు.. పశువుల మేతగా మారిన పంటలతో వ్యవసాయ పొలాలు కళ తప్పాయి. ఆరుగాలం కష్టించి పంటలు పండించే అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. యాసంగి సీజన్‌లో వ్యయ ప్రయాసాలకోర్చి పంటలు సాగుచేసిన రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. పంటలకు నీరందించే బోరుబావుల్లో భూగర్భజలాలు పడిపోవడం.. కరెంటు సక్రమంగా లేకపోవడం.. కాల్వలకు నీటి విడుదల నిలిచిపోవడం తదితర కారణాలతో రైతుల కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పంటసాగుకు చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పంటలు ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాలకు చెందిన రైతు కొంగల రామలింగం నాలుగెకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగుచేశారు. రెండు బోర్ల సహాయంతో మొక్కజొన్నకు నీరు అందిస్తున్నారు. ఇప్పటి వరకు పంట పెట్టుబడిగా రూ.50 వేలు వెచ్చించారు. కంకి పట్టే దశలో ఒక్కసారిగా బోర్లలో నీటిమట్టం పడిపోయింది. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా చేతికందే మొక్కజొన్న పంట కళ్లెదుటే ఎండటంతో విధిలేక పశువులకు మేతగా వదిలిపెట్టారు. మూడు నెలల కష్టంతో పాటు సాగు వ్యయం భూమిలో కలిసిపోయింది. పెట్టుబడి పెట్టిన డబ్బు అప్పుగా మిగిలింది.


గట్టు మండల కేంద్రానికి చెందిన రైతు కుర్వ వీరన్నకు 15 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. 3 కి.మీ. దూరంలో ఉన్న నెట్టెంపాడు ప్రాజెక్టులోని ర్యాలంపాడు కాల్వ నుంచి తన పొలానికి 450 పైపులు వేసుకుని పంటసాగు చేస్తున్నారు. అయితే ఏప్రిల్ వరకు నీటిని అందిస్తామని అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలను నమ్మిన ఈ రైతు.. యాసంగిలో రూ. 3.36లక్షల పెట్టుబడి పెట్టి పదెకరాల్లో వేరుశనగ సాగుచేశారు. రెండున్నర నెలల తర్వాత నీటి తడులకు ఇబ్బందికరంగా మారడంతో 10 ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంటను వదిలేశారు. గతేడాది యాసంగి పంటలకు నీళ్లు రావని చెప్పడంతో సాగుచేయలేదని.. ఈసారి ఏప్రిల్ వరకు నీరందిస్తామని చెప్పడంతో పంటసాగు చేసి, తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిదని రైతు కుర్వ వీరన్న వాపోయారు.



గట్టు శివారులో నీరు లేక ఎండిన పొగాకు పంటను మేస్తున్న గొర్రెలు


హన్వాడ మండలం మునిమోక్షం గ్రామానికి చెందిన రైతు బోయిని అంజిలయ్య ఎకరన్నర పొలంలో వరిసాగు చేశారు. వరినాట్లు, కలుపు నివారణ, క్రిమిసంహారక మందులకు మొత్తం రూ. 40వేలకు పైగా ఖర్చు పెట్టారు. వేసవి ప్రారంభంలోనే బోరులో పూర్తిగా నీరు అడుగంటడంతో పొట్ట దశలో ఉన్న పంటకు నీరు లేక పశువులకు మేతగా వదిలేశారు. యాసంగిలో వరిసాగుతో రూ. 1.40లక్షలు నష్టపోవాల్సి వచ్చిందని రైతు అంజిలయ్య ఆవేదన చెందుతున్నారు.


ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లికి చెందిన రైతు రాసుమళ్ల నాగరాజు దేవుడి పొలం మూడెకరాలు కౌలుకు తీసుకుని వరిపంట సాగుచేశారు. ఇటీవల బోరుబావిలో నీరు తగ్గడంతో రెండెకరాల్లో పంట ఎండిపోవడంతో పశువులకు మేతగా వదిలేశారు. పంటసాగు కోసం రూ.లక్ష వరకు ఖర్చయ్యాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


నవాబుపేట మండలం పల్లెగడ్డకు చెందిన రైతు రామయ్య నాలుగెకరాల్లో వరిసాగు చేశారు. నారు పోసే సమయంలో బోర్లు బాగానే ఉన్నా.. ప్రస్తుతం రెండు బోర్లు కలిసి ఎకరం కూడా సరిగ్గా పారడం లేదు. పంట మొత్తం పూర్తిగా ఎండిపోయింది. సదరు రైతుకు దాదాపు రూ. 2లక్షలకు పైగా అప్పులు మిగలాయి. బోర్లను నమ్ముకుని వరిసాగు చేస్తే అప్పులే మిగిలాయని రైతు రామయ్య రోదిస్తున్నారు.


కౌకుంట్ల మండలం దాసరిపల్లికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి బోరుబావి ఆధారంగా నాలుగెకరాల్లో వరిసాగు చేశారు. బోరుబావిలో నీటిమట్టం పడిపోవడంతో పంటకు నీరందించే పరిస్థితి లేకుండాపోయింది. రైతు కళ్లెదుటే పంట మొత్తం ఎండిపోయింది. పశువుల మేతగా మారిన పంటను చూస్తే కన్నీరు ఆగడం లేదని రైతు వాపోయారు. పంట పెట్టుబడి కోసం తెచ్చిన రూ. లక్షకు పైగా అప్పు ఎలా కట్టాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు.


ఖిల్లాఘనపురం మండలం ముందరితండాకు చెందిన రైతు కేతావత్ ముత్యాలు తనకున్న రెండెకరాల్లో బోరుబావి కింద వరిపంట సాగుచేశారు. మొదట్లో బోరుబావిలో నీరు పుష్కలంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఇటీవల బోరుబావి నీరు తగ్గడంతో రెండెకరాల్లో మూడు మళ్లు తప్ప మిగతా పంట పూర్తిగా ఎండిపోయింది. మరో రెండు తడులు పెడితే పంట చేతికి వచ్చేది. పంటసాగు కోసం రూ. 60వేలు ఖర్చు చేసినట్లు రైతు ముత్యాలు వాపోయారు. చేసిన అప్పు ఎలా కట్టాలో పాలుపోవడం లేదని కంటతడి పెట్టుకుంటున్నారు.

కాల్వ నీరు అందక ఎండింది..


సంగంబండ రిజర్వాయర్ కుడి కాల్వపై ఆధారపడి నాలుగెకరాల్లో వరిసాగు చేశా. పంట చేతికివచ్చే సమయానికి కాల్వ నీరు అందకపోవడంతో పంట మొత్తం పశువులకు వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంటసాగు కోసం రూ. 1.20లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. పది రోజులుగా 800 మీటర్ల దూరం సాగు నీరు తీసుకురావడానికి రూ. 30 వేలకు పైగా ఖర్చుచేసినా ఫలితం లేకుండాపోయింది. పంట పూర్తిగా ఎండిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సురేష్, యువ రైతు, తాళంకేరి, మాగనూర్ మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి..


నేను రెండున్నర ఎకరాల్లో వరిసాగు చేశా. ఇప్పటి వరకు రూ. 80వేల వరకు పెట్టుబడులు పెట్టాను. పంట పొట్టదశకు వచ్చే సమయంలో కాల్వ నీరు బంద్ కావడం, బోరు నీరు రాకపోవడంతో పంట మొత్తం ఎండింది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– శంకరమ్మ, మహిళా రైతు, తాళంకేరి, మాగనూర్ మండలం

అప్పులే మిగిలాయి..


కాల్వ నీరు అందుతుందనే ఆశతో రూ. 90వేల పెట్టుబడులు పెట్టి రెండెకరాల్లో వేరుశనగ, ఒక ఎకరంలో వరిపంట సాగు చేశా. అధికారులు, పాలకులు చెప్పినట్టుగా కేఎల్ఐ డీ–8 కాల్వ నుంచి మైనర్ కాల్వను తవ్వకపోవడం, ఉన్న బోరులో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో నీరు అందక సాగుచేసిన పంటలు ఎండిపోయి పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– కంద్యానాయక్, అన్నారంతండా, పాన్‌గల్ మండలం

పశువులకు వదిలేశా..


యాసంగి సీజన్ ప్రారంభంలో బోరుబావిలో నీరు పుష్కలంగా ఉండటంతో నాలుగెకరాల్లో వరిపంట సాగుచేశా. వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు నీరు రావడంలేదు. ఇప్పటికే రెండెకరాల్లో పంట పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు వదిలేశా. పంటసాగు కోసం రూ. 80వేల వరకు ఖర్చుచేశాను.

– కె.శ్రీనివాస్‌రెడ్డి, రైతు, చౌక్కన్నపల్లి, వెల్దండ మండలం

లోఓల్టేజీ సమస్య వేధిస్తోంది..


గోపాల్‌పేట మండలం బుద్ధారం శివారులో నేను పదెకరాల్లో వరి పంట సాగుచేశా. నెలరోజులుగా లోఓల్టేజీ సమస్య వేధిస్తోంది. అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు. మోటార్లు కాలిపోతున్నాయి. 50 ఎకరాల పంట వరకు వారం రోజుల్లో ఎండిపోయే ప్రమాదం ఉంది. లోఓల్టేజీ సమస్య తీర్చాలి.

–ఎర్ర లక్ష్మయ్య, రైతు, బుద్ధారం, గోపాల్‌పేట మండలం

గొర్రెల మేతకు ఇచ్చా..


బోరుబావిలో ఉన్న నీటితో పంట పండించుకుందామని మూడెకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. పుప్పొడి దశలో ఉన్న పంటకు నీరందే పరిస్థితి లేక గొర్రెల మేతకు ఇచ్చాను.

– మద్దిలేటి, రైతు, రామాపురం, వడ్డేపల్లి మండలం

ఉన్న పంట కూడా చేతికొచ్చేలా లేదు..


బోరుబావులపై ఆధారపడి మూడెకరాల్లో వరిసాగు చేశా. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గడం, కరెంటు సక్రమంగా రాకపోవడంతో రెండెకరాల్లో పంట ఎండింది. రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట ఎండిపోతుంటే బాధగా ఉంది. కనీసం ఉన్న ఎకర పొలంలో అయినా పంట చేతికి వచ్చేలా లేదు.

– రైతు టీక్యానాయక్, పెద్దగూడెంతండా, వనపర్తి మండలం

చివరి దశలో కాల్వ నీరు రాక..


కేఎల్ఐ కింద ఐదెకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. పంటను సాగుచేసే సమయంలో కేఎల్ఐ కాల్వ ద్వారా నీరు బాగానే వస్తుండేవి. పంట చేతికందే సమయంలో నెల రోజుల నుంచి కాల్వలో నీరు రావడం లేదు. దీంతో పంట పూర్తిగా ఎండిపోయింది. పంటసాగుకు దాదాపు రూ. 70వేలు ఖర్చు చేశాను. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.


– కుర్మల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, చౌక్కన్నపల్లి, వెల్దండ మండలం

నీటి విడుదల సక్రమంగా ఉండాలి..


తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా నీరు సక్రమంగా విడుదల చేస్తే పంటలు బాగా పండుతాయి. నీరు వస్తే పొలాలు మునిగేలా విడుదల చేస్తారు. లేకపోతే 20 రోజులైనా రావు. పంటలకు అవసరమైనప్పుడు నీటి తడులు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి తగ్గి నష్టపోయాం.

– జమ్మన్న, ఆయకట్టు రైతు, పైపాడు, వడ్డేపల్లి మున్సిపాలిటీ

దొరకని కార్మికుల ఆచూకీ


సొరంగంలో టీబీఎం శకలాలను లోకో ట్రైన్‌లో నింపుతున్న సహాయక బృందాలు

- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- అధికారులకు సవాల్‌గా మారిన ప్రమాదం

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న కార్మికుల జాడ కోసం సహాయక బృందాలు నెలరోజులుగా శ్రమిస్తున్నాయి. కేరళకు చెందిన కడావర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపడుతున్నా ఫలితం లేకపోతోంది. గత నెల 22న జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకోగా.. ఈ నెల 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైంది. సొరంగం కుప్పకూలిన 14 కిలోమీటరు వద్ద మట్టి, బండరాళ్లు, టీబీఎం శకలాల కింద మిగిలిన ఏడుగురు కార్మికులు ఉండి ఉంటారని సహాయక సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ ప్రదేశంలో మట్టి, బురద, రాళ్ల తొలగింపు ప్రక్రియ చేపడితే కూలిపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దీంతో ఆచితూచి తవ్వకాలు చేపడుతుండగా.. ఆ ప్రాంతానికి వెళ్లేందుకు ఎవరు కూడా సాహసం చేయడం లేదు. ఇదిలా ఉండగా.. ఆదివారం 30వ రోజు డీ1, డీ2 ప్రదేశాల్లో తవ్వకాలు కొనసాగాయి. టీబీఎం భాగాలను దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్లాస్మా కట్టర్లతో తొలగించి బయటకు పంపిస్తున్నారు. సొరంగంలో ఉబికి వస్తున్న నీరు, పేరుకుపోతున్న మట్టితో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ప్రమాద ప్రదేశం వరకు పూర్తిస్థాయిలో విద్యుత్, వెంటిలేషన్ పనులు పునరుద్ధరించారు.


బురద నీటిని బయటకు తరలించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న సహాయక బృందం

నేడు ముఖ్యమంత్రితో సమీక్ష..

సోమవారం శాసనసభ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, వికాస్‌సింగ్, ఎన్డీఆర్ఎఫ్ అధికారి డా. హరీశ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జీఎం బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అడిషనల్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్, కేరళ కడావర్ డాగ్స్ బృందంతో పాటు జేపీ కంపెనీకి చెందిన 12 రకాల సహాయక బృందాల ఉన్నతాధికారులు ఆదివారం తరలివెళ్లారు. సమీక్షలో ప్రధానంగా నెలరోజుల్లో తీసుకున్న చర్యలు.. ఎలాంటి సహాయక చర్యలు చేపడితే సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తేవచ్చనే అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.

సహాయక చర్యలు వేగవంతం..

సొరంగంలో మట్టి తవ్వకాలు, డీ వాటరింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం ఉదయం జేపీ కంపెనీ క్యాంపు కార్యాలయం వద్ద సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక బృందాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు సొరంగం లోపలి పరిస్థితులను ఆయనకు వివరించారు. సొరంగంలో అత్యంత ప్రమాద ప్రదేశంగా భావిస్తున్న ప్రాంతంలో తప్ప మిగిలిన ప్రదేశాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. సహాయక బృందాలకు కావాల్సిన సదుపాయాలు, వసతులు కల్పిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

పాలమూరు రెడ్డి సేవా సమితి సేవలు అమోఘం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి సేవలు అమోఘమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రాజబహదూర్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఆదివారం సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన పాలమూరు రెడ్డి సేవాసమితి 23వ వార్షికోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాలమూరు రెడ్డి సేవా సమితి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉన్నతస్థానంలో నిలిచిందన్నారు. 23 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. రెడ్డి సేవా సమితి ఏం చేసినా అది సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. గతంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఏర్పాటు చేసిన బాలికల హాస్టల్ ఇప్పుడు మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాల కార్యాలయంగా సమాజానికి ఉపయోగపడుతున్నదని, అక్కడ మొదటి బ్యాచ్‌లో 280 మంది మహిళలకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. చదువుకు నోచుకోని అన్ని వర్గాల పేద విద్యార్థుల కోసం మహబూబ్‌నగర్ విద్యానిధి ఏర్పాటు చేశామని, మీరంతా విద్యానిధికి చేయూత ఇవ్వాలని కోరారు. డీసీసీబీ అధ్యక్షులు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని నిరుపేదలు స్వయం ఉపాధి కోసం తగు వివరాలతో వస్తే రుణసదుపాయం కల్పిస్తామన్నారు. భక్తమల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుమతి మాట్లాడుతూ రెడ్లు ఆర్థికంగా ఎదిగి తమ పిల్లలకు మంచి విద్యను అందించి వారు జీవితంలో స్థిరపడే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం రెడ్డి సేవా సమితి 23వ వార్షికోత్సవ సంచికను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి హాస్టల్ అధ్యక్షుడు ఎం.వెంకటరంగారెడ్డి, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పీవీ నందకుమార్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ టి.పాపిరెడ్డి, సినీ నిర్మాత బసిరెడ్డి, సమితి ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మద్ది అనంతరెడ్డి, రాఘవరెడ్డి, మల్లు నరసింహారెడ్డి, జి.వెంకట్రాంరెడ్డి, ఎస్.సురేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మేఘారెడ్డి, వెంకటరాజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సరస్వతి, స్వరూప, శోభ, వరలక్ష్మి, నర్మద, శశికళ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


టెన్నికాయిట్ క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 25 నుంచి 29 వరకు జరగనున్న జాతీయస్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. హనుమకొండలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన యాసిన్, సుజాయత్, మమత, జాహ్నవి, శ్రీనిధిలు ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం క్రీడాకారులు జాతీయపోటీలకు బయలుదేరగా వీరిని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లయన్ నటరాజ్, వడెన్న, పీఈటీ ర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్థిబా, 9121625779.

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ. 18k ఫోన్: 9840400073, 9160900024

భవిత విద్యార్థుల కోసం

గమనిక

యువకుడి బలవన్మరణం


కావలి సాయికుమార్ (ఫైల్)

మద్దూరు/కొత్తపల్లి: ప్రేమించిన అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారని మనస్తాపానికి గురై ఓ యువకుడు పురుగుమందు తాగి మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలం గోకుల్‌నగర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కావలి సాయికుమార్ (22) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ఏడాదిగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని అమ్మాయి తండ్రి రాములుకు చెప్పగా ఆయన మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 17న పొలంలో పురుగుమందు తాగాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గుర్తించి వెంటనే జిల్లా ఆస్పత్రికి, అటు నుంచి మహబూబ్‌నగర్ ఎస్వీఎస్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం హైదరాబాద్ నిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. తల్లి కావలి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ ఆదివారం వివరించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పతిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో 65 ఏళ్ల వృద్ధుడు మృతి చెంది ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జనరల్‌ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే స్థానిక పోలిస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ : ఒకరికి గాయాలు


గాయపడిన లోకేష్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులు ఘర్షణ పడగా ఓ విద్యార్థి చెయ్యి విరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. మహబూబ్‌నగర్ రోడ్‌లో ఉన్న ఎస్సీ–ఏ ప్రభుత్వ హాస్టల్‌లో 85 మంది విద్యార్థులు ఉంటున్నారు. 7వ తరగతి విద్యార్థి లోకేష్ ట్రంకు పెట్టె తాళాన్ని విరగ్గొట్టి అందులోని సామగ్రిని కొందరు విద్యార్థులు దొంగిలించారు. ఆ వస్తువులు మీరే తీశారంటూ లోకేష్ కొంతమంది విద్యార్థులను ప్రశ్నించగా వారంతా గుంపుగా ఏర్పడి కొట్టడంతో ఎడమ చెయ్యి విరిగింది. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఘటన విషయాన్ని హాస్టల్ వార్డెన్ కృష్ణయ్య వద్ద ప్రస్తావించగా.. రాత్రి 8 వరకు హాస్టల్‌లోనే ఉన్నానని, భోజనానికి ఇంటికి వెళ్లి వచ్చేసరికి విద్యార్థులు గొడవపడ్డారన్నారు. గొడవ విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేసి విద్యార్థులను మందలించానని చెప్పారు.

లారీ బోల్తా.. నలుగురికి గాయాలు


ఘటన స్థలంలో ఇనుప చువ్వలు, లారీ

చారకొండ: లారీ బోల్తాపడి నలుగురు గాయాల పాలైన ఘటన మండలంలోని జూపల్లి సమీపం 167వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంషోద్దీన్ కథనం మేరకు.. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు ఇనుప చువ్వల లోడ్‌తో వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప ర్యాంపును, అటుగా వస్తున్న ఆటోను ఢీకొని రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై లారీ పడటంతో సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి ప్రొక్లెయిన్ సాయంతో రోడ్డుపై పడ్డ ఇనుప చువ్వలు, లారీని పక్కకు తొలగించారు. ఆటో డ్రైవర్ లోకిలాల్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శంషోద్దీన్ వివరించారు.